
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 33 । కనిష్ఠం 18 | భద్రాద్రి: గరిష్ఠం 35 । కనిష్ఠం 25
శుక్రవారం, 16 ఫిబ్రవరి 2024




సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న రేణుకాచౌదరి

పెద్దల సభకు ఇద్దరు

- నామినేషన్లు దాఖలు చేసిన రేణుకాచౌదరి, వద్దిరాజు
- తరలివెళ్లిన ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు
- జిల్లాలో పెరగబోతున్న చట్టసభల ప్రతినిధులు


కేటీఆర్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న వద్దిరాజు

ఖమ్మం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాజ్యసభ ఎన్నికలకు గురువారం కాంగ్రెస్ నుంచి ఖమ్మం మాజీ ఎంపీ, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న వద్దిరాజు రవిచంద్ర గురువారం హైదరాబాదులోని అసెంబ్లీ హాల్‌వద్ద నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలుండగా రెండు స్థానాలు జిల్లాకే దక్కనున్నాయి. మూడు సీట్లకు ముగ్గురు మాత్రమే నామినేషన్లు వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నామినేషన్ల సందర్భంగా జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రేణుకాచౌదరి వర్గీయులు భారీగా హైదరాబాదుకు తరలివెళ్లారు. ఉదయం రేణుకాచౌదరిని కలిసి అభినందనలు తెలిపారు. రేణుకాచౌదరికి పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ బీఫారం అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయితో పాటు పలు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉదయం రేణుకాచౌదరి ఇంటివద్ద జిల్లాకు చెందిన మండలస్థాయి నాయకులు కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. బీఫారం అందుకున్న తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి వెళ్లి రేణుకాచౌదరి రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి వద్దిరాజు రవిచంద్ర కూడా గురువారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ముఖ్యనాయకులు హైదరాబాదు తరలి వెళ్లారు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వరరెడ్డి, దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరి, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత నామ నాగేశ్వరారవు ఒక ప్రకటనలో వద్దిరాజుకు అభినందనలు తెలిపారు.

జిల్లాలో పెరగనున్న చట్టసభల ప్రతినిధులు

జిల్లా నుంచి చట్టసభల ప్రాతినిధ్య ప్రతినిధుల సంఖ్య పెరగబోతోంది. ఫలితంగా వారి కోటా నిధులు కూడా జిల్లాకు అధికంగా విడుదలయ్యే అవకాశం ఉంది. తాజాగా జిల్లా నుంచి రేణుకాచౌదరి, వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభకు వెళుతుండగా ఇప్పటికే హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారధరెడ్డి జిల్లా నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఖమ్మం ఎంపీగా లోక్‌సభ పక్ష నేతగా నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీగా మాలోతు కవిత ఉమ్మడి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా తాతా మధు బీఆర్ఎస్ నుంచి ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ఉండడంతో జిల్లాకు ఇకపై భారీగా నిధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆశిస్తున్నారు.

పొంచిఉన్న ప్రోటోకాల్ సమస్యలు

ఇదిలా ఉండగా ఒకేజిల్లా నుంచి ఇంతమంది ప్రజాప్రతినిధులు చట్టసభల్లో ఉండడంతో ప్రొటోకాల్ విషయంలో అధికారులకు కొత్త తలనొప్పులు తలెత్తే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు పర్యటనల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటుతోపాటు అభివృద్ధి, సమీక్షా సమావేశాలకు అధికారులు రాజ్యసభ, లోక్‌సభ, శాసనమండలి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. ప్రోటోకాల్ నిబంధనలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సమాచారం జాప్యం జరిగినా సభలు, సమావేశాల్లో ప్రోటోకాల్‌పై వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అధికారులకు ప్రోటోకాల్ అమలు పరీక్ష కాబోతోంది.

తీవ్ర జ్వరంతో ఖమ్మానికి చెందిన కవిత అనే మహిళ జిల్లా ఆసుపత్రిలో వైదుడిని సంప్రదిస్తే పూర్తిస్థాయి(సీబీపీ) రక్తపరీక్ష రాశారు. ఆ పరీక్ష చేసేందుకు టీ హబ్‌కు రక్త శాంపిల్స్ పంపించారు. కానీ అక్కడ యంత్రం పనిచేయడం లేదని తిప్పి పంపించారు. దాంతో ఆమె ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించుకుంది. ఖమ్మం నగరానికే చెందిన మరో మహిళకు వైద్యులు హెచ్‌బీ-ఏ1సీ పరీక్ష చేయించుకొని రమ్మని రాసిచ్చారు. కానీ జిల్లా ఆసుపత్రిలో రక్తనమూనాలు తీసుకునే విభాగంలోని సిబ్బంది ఈ పరీక్ష ప్రస్తుతం ఇక్కడ చేయడం లేదని చెప్పడంతో ఆమె ప్రైవేటు ల్యాబ్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇది ఒక్కరిద్దరి సమస్య కాదు.. జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలతో పాటు పలు ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఎదుర్కొంటున్న పరిస్థితి.

పేద రోగులకు పెద్ద పరీక్ష



ఖమ్మం జిల్లా జనరల్ ఆసుపత్రిలోని డయాగ్నస్టిక్ సెంటర్

- ఖమ్మం జనరల్ ఆసుపత్రిలోని 'టీహబ్'లో సాంకేతిక సమస్యలు
- రసాయనాల కొరతతో నిలిచిపోయిన సేవలు
- వృద్ధులు, గర్భిణులు, జ్వరబాధితులకు తీవ్ర ఇబ్బందులు
- 20రోజులుగా నిలిచిన ప్రధాన పరీక్షలు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు 137రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన టీహబ్ నిరుపయోగంగా మారుతోంది. నిత్యం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చికిత్సల కోసం రోగులు ఖమ్మంలోని పెద్దాసుపత్రికి తరలి వస్తున్నారు. ఈఆసుపత్రి ప్రభుత్వం మెడికల్‌కళాశాల పరిధిలోకి వచ్చిన తర్వాత ఇంకా మెరుగైన వైద్య సేవలు అందుతాయని భావిస్తే ఇక్కడికి వచ్చే రోగులకు నిరాశే మిగులుతోంది. కనీసం వారికి సరైనచికిత్స అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. రోగులకు రోగ నిర్ధారణ కోసం రక్త నమూనాల పరీక్షలు అత్యం ముఖ్యమైనవి. కానీ గత 20 రోజులుగా జిల్లా ఆసుపత్రిలోని టీహబ్‌లో రక్త నమూనాలను సేకరించడానికి కూడా తిరస్కరిస్తున్నారు. ల్యాబ్‌లోని యంత్రాల్లో సాంకేతిక సాంకేతిక సమస్యలు తలెత్తాయని, సెల్‌కౌంటర్‌కు అవసరమైన రీఏజెంట్లు(రసాయినాలు) లేకపోవడం వంటి కారణాలు చెబుతూ యూరిక్ యాసిడ్, హెచ్‌బీ ఏ1సీ, సీబీపీ, థైరాయిడ్ లాంటి పరీక్షలను చేయడం లేదు. ఇలాంటి పరిస్థితు ల్లో గత 20 రోజులుగా రోగులు ప్రైవేటుకు పరుగులు తీస్తున్నారు. దాంతో వారిపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. జిల్లా ఆసుపత్రిలో అధికారులు రోగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఆరంభ శూరత్వమే..

గతంలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలంటే ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లకు రిఫర్ చేయాల్సి వచ్చేది. కానీ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య పరీక్షలను నిర్వహించేందుకు వీలుగా డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోటిన్నర విలువైన పరికరాలు, అదీ కార్పోరేట్ ఆసుపత్రుల మాదిరిగా పూర్తిస్థాయి ఆటోమేటిక్ యాంత్రాలను సమకూర్చి నిరుపేదలకు ఒక్క పైసా ఖర్చు లేకుండా 137 రకాల వైద్య పరీక్షలను నిర్వహించడానికి టీ హబ్‌ను ఏర్పాటు చేశారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త, మూత్రం, కిడ్నీ, లివర్, కాన్సర్, థైరాయిడ్, లాంటి 137 రకాల వైద్య పరీక్షలను నిర్వహించేందుకు డయాగ్నస్టిక్ సెంటర్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. రూ.కోటిన్నర విలువైన ఆటోమేటిక్ బయోకెమిస్ట్ అనలైజింగ్, ఆటోమేటిక్ హెమటాలజీ మిషన్, ఆటోమేటిక్ యూరిన్ అనలైజింగ్, హర్మోన్ ఎనలైజింగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. వీటిలో బయోకెమిస్ట్ విభాగంలో 36 పరీక్షలను, పాథాలజీ విభాగంలో 14 పరీక్షలను, మైక్రోబయాలజీ విభాగంలో 8 పరీక్షలను నిర్వహించేలా పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లో జిల్లా ఆసుపత్రితో పాటు జిల్లాలోని 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల నుంచి సేకరించిన రక్తనమూనాలను పరీక్షిస్తారు. అయితే ఈ ల్యాబ్ ఏర్పాటు చేసిన కొత్తలోనే పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత అనేక కారణాలతో పలు పరీక్షలను నిర్వహించడం లేదు. ఈ క్రమంలో ఇటీవల యంత్రాల్లో సాంకేతిక సమస్యలు, రసాయనాల కొరత కారణంగా ముఖ్యమైన పరీక్షలను నిర్వహించ లేకపోతున్నారు. దాంతో ఈ ల్యాబ్ ఏర్పాటు చేసిన లక్ష్యం నీరుగారిపోతోంది.

రీ ఏజెంట్లు తెప్పించాం



డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఖమ్మం టీహబ్‌లో అన్ని సేవలు నిర్వహిస్తున్నాం. వారంరోజుల క్రితం రీఏజెంట్స్ అయిపోతే హన్మకొండ నుంచి తెప్పించాం. యంత్రాల మరమ్మతుల విషయం నా దృష్టికి రాలేదు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

రోజుకు 600 శాంపిల్స్ పరీక్షించాలి

జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 600 శాంపిల్స్ సేకరిస్తున్నారు. గత 20 రోజులుగా టీ హబ్ మూలనపడడంతో గర్భిణులు, వృద్ధులు, ఇతర సమస్యలు ఉన్న రోగుల నుంచి శాంపిల్స్ సేకరించడం లేదు. టీహబ్ పనిచేయడం లేదని కేవలం నామమాత్రంగా మాన్యువల్‌గా పరీక్షలు చేస్తున్నారు. అత్యవసరంగా నిర్ధారణ పరీక్షల ఫలితాలు కావాలంటే బాధితులు ప్రైవేటు ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఐపీ రోగులకు మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. ఓపీ రోగులను మాత్రం వెనక్కు పంపిస్తున్నారు. యంత్రాల్లో సాంకేతిక లోపాలు, రీఏజెంట్లు లేక రక్తనమూనాలకు కనీసం గ్రూపింగ్ (రక్తవర్గం నిర్ధారణ) చేయలేని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో సేకరించిన శాంపిల్స్‌కు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయా వ్యక్తులకు మొబైల్‌లో ఎస్ఎంఎస్ ద్వారా నివేదికలను పంపించాల్సి ఉంది. ఏ రోజు సేకరించిన నమూనాలకు ఆ రోజే నివేదికలను పంపించాల్సి ఉండగా ప్రస్తుతం పది రోజులు దాటినా ఎస్ఎంఎస్ రాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తిరిగి ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా రూ.కోట్లు వెచ్చించి నిరుపేదలకోసం ఏర్పాటు చేసిన టీహబ్ లక్ష్యం నీరుగారిపోతోంది.

ఇల్లెందులో బీఆర్ఎస్‌కు

కౌన్సిలర్ రాజీనామా

- ఎమ్మెల్యే కోరం కనకయ్యపై కిడ్నాప్ కేసు వాపస్?

ఇల్లెందు, ఫిబ్రవరి 15: ఇల్లెందు మునిసిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇటీవల ఇల్లెందు మునిసిపల్ ఛైర్మన్ డీవీపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా అవిశ్వాసానికి అనుకులంగా క్యాంపులో ఉండి ఓటింగ్‌కు హాజరవుతున్న సందర్భంలో తన భర్తను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కిడ్నాప్ చేశారని కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు భార్య ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యేతో పాటు మరో 16మందిపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే తాజాగా కౌన్సిలర్ నాగేశ్వరరావు తనను ఎవ్వరూ కిడ్నాప్ చేయలేదని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆయన బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని నిశ్చయించుకున్నట్లు తెలిసింది.

నేడు సార్వత్రిక

గ్రామీణ బంద్

- పిలుపునిచ్చిన బీజేపీయేతర పార్టీలు, ప్రజా సంఘాలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, కూలీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పోరేట్ శక్తులకు దేశాన్ని పెడుతోందని ఆరోపిస్తూ బీజేపీయేతర రాజకీయ పార్టీలు శుక్రవారం దేశ వ్యాప్త సార్వత్రిక గ్రామీణబంద్‌కు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలోనూ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, ఎన్డీ, బీఆర్ఎస్ పార్టీల కార్మిక, రైతు సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. గత నెల రోజులుగా ఈ బంద్‌పై ప్రజలు, కార్మికులు, రైతులకు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. మేధావులతో సెమినార్‌లు ఏర్పాటు చేశారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఎం, సీపీఐ, ప్రజాపంథా, ఎన్డీ రాజకీయ పార్టీలతో పాటుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు సైతం గ్రామీణ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులకు బంద్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణబంద్‌ను విజయవంతానికి కావాల్సిన కార్యాచరణను బీజేపీయేతర పార్టీలు ఐక్యంగా అమలు చేస్తున్నాయి.

రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఏపీలోని గోదావరి, కృష్ణా నదుల ఇసుకను సరిహద్దు గ్రామాల ర్యాంపుల నుంచి తెలంగాణకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దు నుంచి రాత్రి వేళ గప్‌చుప్‌గా ఈ ఇసుక దందా నడుస్తోంది.


సారపాక వద్ద పట్టుబడిన ఏపీకి చెందిన ఇసుక లారీలు

ఆంధ్రా ఇసుక

అడ్డదారిలో..

- తెలంగాణ సరిహద్దుల నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు తరలింపు
- అటు కృష్ణా, ఇటు గోదావరి నుంచి అక్రమ రవాణా
- భద్రాద్రి జిల్లా సారపాక వద్ద పట్టుబడ్డ 17 లారీలు
- ప్రభుత్వ పెద్దల పేరుచెప్పి తప్పించుకునే యత్నం
- రూ.5.50లక్షల రాయల్టీని వసూలు చేసిన మైనింగ్ అధికారులు

ఖమ్మం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమాలు జరిగాయి. అప్పటి ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి ఇసుక అక్రమ రవాణా కూడా ఒక కారణంగా ఉంది. అధికార పార్టీని అడ్డుగా పెట్టుకుని ఇష్టానుసారంగా ఇసుక అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు గడించారు. అయితే రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం మారడంతో కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఇసుక మాఫియా మళ్లీ అక్రమ రవాణా మొదలు పెట్టింది. కొంతమంది ప్రజాప్రతినిధుల పీఏలు, రాష్ట్రస్థాయిలో ఉన్న మంత్రుల అనుచరులు గోదావరి ఇసుకపై కన్నేశారు. అయితే తెలంగాణ ఇసుక కాకుండా ఇప్పుడు ఆంధ్రాలోని ఇసుకను ఇక్కడికి రవాణా చేసి సొమ్ము చేసుకుకునేందుకు పథకం రచించారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం సమీపంలో ఏపీలోని పాడేరు జిల్లా యటపాక మండలం గుండాల ఇసుక ర్యాంపు నుంచి రాత్రి వేళ ఒకేసారి భారీ సంఖ్యలో లారీల్లో భద్రాచలం, కొత్తగూడెం మీదుగా హైదరాబాదుకు ఇసుక రవాణా చేస్తున్నారు. వాస్తవానికి ఆంధ్రాలో సేకరించిన ఇసుకను ఆ రాష్ట్రంలోనే వినియోగించాలి. తెలంగాణకు రావాలంటే ఇక్కడి ప్రభుత్వానికి రాయల్టీతో పాటు జీఎస్టీ చెల్లించాలి. మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళ దర్జాగా భారీ కంటెయినర్లలో ఇసుక రవాణా సాగిస్తున్నారు. అలా ఆంధ్రా నుంచి తెలంగాణలోకి ఇసుక తరలిస్తుండగా బుధవారం రాత్రి సారపాక చెక్‌పోస్టులో టీఎస్ఎండీసీ, పోలీసు శాఖ అధికారులు 17లారీలు పట్టుకున్నట్లు తెలిసింది. అయితే ఈ లారీల్లో ఓ లారీ అద్దానికి రాష్ట్రానికి చెందిన ఓ ముఖ్యనేత స్టిక్కర్ అంటించి ఉండడంతో కొంత వివాదాస్పదమైంది. అయినా మైనింగ్ అధికారులు ఆ ఇసుకకు రూ.5.50లక్షల రాయల్టీ వసూలు చేసి లారీలను వదిలేశారు. అయితే 11లారీలను మాత్రమే పట్టుకుని ఫైన్ వేసినట్టుగా అధికారులు పత్రికాప్రకటన విడుదల చేశారు. కానీ వాస్తవానికి వారు 17లారీలు పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా పట్టుబడిన లారీలను విడిపించేందకు రాష్ట్రంలో ఒక మంత్రి పీఏ పేరుతో తీవ్రంగా ప్రయత్నించినట్టు తెలిసింది. కానీ అధికారులు మాత్రం జరిమానా విధించిన తరువాతనే లారీలను వదిలేశారు. తాజా ఘటన నేపథ్యంలో ఇప్పటికైనా ఇసుక అక్రమరవాణాపై ఆంధ్రా సరిహద్దుల్లో నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. లేకపోతే గత ప్రభుత్వంలో మాదిరిగా ఇసుక మాఫియా రెచ్చిపోయే అవకాశం ఉంది.

నేటితో ముగియనున్న వాగ్గేయకారోత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 15: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ భద్రాచల రామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ నెల 12న భక్తరామదాసు జయంతిని పురస్కరించుకొని స్థానిక చిత్రకూట మండపంలో వాగ్గేయకారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం హైదరాబాద్‌కు చెందిన ఎన్. శంకుమాశర్మ వయోలిన్, వేంపాటి శ్యామలాదేవి, ప్రమీల, నాగవేణి చంద్రమౌళి, అనూష, హేమలత, నాగలక్ష్మిల సంగీత కచేరి శ్రోతలను ఆకట్టుకుంది. అలాగే త్రిషకుమ్ ఇషా, ఎన్.కృష్ణ మోహన్, వి.శ్రీలక్ష్మి, కాపువేలి లలిత విజయకుమార్, విజయవాడకు చెందిన కె.గోపాలరావు, బెంగుళూరుకు చెందిన దూళిపాల వాసవిల శాస్త్రీయ సంగీతం భక్తులను అలరించింది. శుక్రవారం వాగ్గేయకారోత్సవాలు ముగియనున్నాయి. ఇదిలా ఉండగా శ్రీ సీతారామ చంద్రస్వామిని గురువారం ఐఎఎస్ అధికారి బాలాజీ మంజులే దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భద్రాచలానికి చెందిన ముసులూరి మస్తాన్‌రావు, లక్ష్మి దంపతులు రూ.30వేలు విలువ చేసే ఆరగింపు ప్రసాదానికి ఉపయోగించే బల్లలను దేవస్థానానికి అందజేశారు.


వాగ్గేయకారోత్సవాల్లో భక్తి సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

నిత్యాన్నదానానికి రూ.25లక్షల విరాళం

దేవస్థానం ఆధ్వర్యంలోని నిత్యాన్నదాన పథకం, ఆలయ అభివృద్ధికి ఏపీలోని ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన డాక్టర్ యార్లగడ్డ చంద్రమౌళి రూ.25 లక్షలు విరాళం అందజేశారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్న ఆయన తన కుమార్తె ఎన్ఆర్ఐ డాక్టర్ రాధిక పేరిట ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌పై

అవిశ్వాసం

- డీసీవోకు నోటీసు ఇచ్చిన సొసైటీ డైరెక్టర్లు


డీసీవోకు నోటీసు అందజేస్తున్న చేగొమ్మ సొసైటీ డైరెక్టర్లు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 15: ఖమ్మం డీసీసీబీబ్యాంకు డైరెక్టర్, కూసుమంచి మండలం చేగొమ్మ సొసైటీ అధ్యక్షుడు ఇంటూరి శేఖర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావుకు గురువారం ఏడుగురు డైరెక్టర్లు నోటీసు అందించారు. చేగొమ్మ సొసైటీలో మొత్తం 13మంది సభ్యులుండగా వారిలో ఏడుగురు సభ్యులు అవిశ్వాస పత్రంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో కె.నరసింహారావు, ఏ.వెంకన్న, బి.నాగమ్మ, జి.ముత్తయ్య, ఐ.ఉపేందర్‌రావు, బానోత్ సామ్య, జి.గురుస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా డీసీవో మురళీధర్‌రావు మాట్లాడుతూ చేగొమ్మ సొసైటీ సభ్యులు ఛైర్మన్ ఇంటూరి శేఖర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ తమకు నోటీసు ఇచ్చారని తెలిపారు. 15 రోజుల్లో అందరికీ నోటీసులు ఇచ్చిన తరువాత అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తనకు నోటీసులు అందిన 30 రోజుల్లోపు ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు.

మహిళా కార్పొరేటర్‌కు ముందస్తు

బెయిల్ నిరాకరణ

- జీవో 59 అక్రమబద్ధీకరణ కేసులో పిటిషన్ దాఖలు చేసిన పగడాల శ్రీవిద్య

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 15: జీవో 59 అక్రమ క్రమబద్ధీకరణ కేసులో నగరంలో 53డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య వేసిన ముందస్తు బెయిల్ పిటీషన్‌ను ఖమ్మం కోర్టు కొట్టివేసింది. 59జీవో పేరుతో నగరంలో 415గజాల స్థలాన్ని అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న విషయంలో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ఏ1గా, ఆమె భర్త పగడాల నాగరాజును ఏ2గా ఉండగా.. పగడాల నాగరాజును గతంలోనే ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా ఆయన బెయిల్ మీద బయటకు వచ్చారు. కాగా సంబంధిత కేసులో ఏ1గా ఉన్న శ్రీవిద్య జిల్లా కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేయగా విచారించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి బీఎస్ జగజ్జీవన్‌కుమార్ బెయిల్ నిరాకరిస్తూ బుధవారం తీర్పుచెప్పారు. పీపీ శంకర్ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ముందస్తు బెయిల్‌ను న్యాయాధికారి కొట్టివేశారు.



బొజ్జాయిగూడెంలో

మినీ మేడారం

- 20న జాతర ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు
- భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

5

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టే... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామలక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కంబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

● వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తీర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను ఆర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దె పైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.


ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.

ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.

ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.

ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.

ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



● నూతి శివానందం

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

అవధూత శిఖామణి

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః



జ్ఞాన కార్యసాధకుడు

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేనని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

● మధ్వ ప్రచార పరిషత్, 9440258841

20నుంచి బొజ్జాయిగూడెంలో
మినీ మేడారం జాతర

» ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు » భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు




ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, ఎంపీడీవో దన్‌సింగ్, వెలిసిన దుకాణాలు

ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 15: వన దేవతల జాతరకు అధికారులు భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ఇల్లెందు మండ లం బొజ్జాయిగూడెంలో ఈనెల 20నుంచి జరగనున్న మినీ మేడారం జాతరను పనులను గురువారం ఇల్లెందు ఎంపీడీవో దన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, పంచాయతీ కా ర్యదర్శి రజీయ, సమ్మక్క-సారక్క ఆలయ కమిటి చైర్మన్ కొర్సా కోటయ్య, మాజీసర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా ఇల్లెందు మండలం బొజ్జాయిగూ డెం గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైఉన్న సమ్మక్క-సారలమ్మ తల్లులకు మేడారం తరహాలోనే మినీ మేడారం జాతర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 20, 21, 22, 23, 24 తేదిలలో సమక్క-సారలమ్మ జాతర జరుగుతుందని, భక్తులకు అసౌకర్యాలు కలగకుం డా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 21న అమ్మవారులకు పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు, బోనాలు నాలుగు గ్రామాల ప్రజలు సమర్పించనున్నట్లు తెలిపారు. అదేరోజు ముసలమ్మ బోడు నుంచి సారలమ్మను తీసుకొ చ్చి గద్దెలపై కూర్చోబెట్టనున్నట్లు తెలిపారు. 22న సమ్మక్క తల్లిని చిలకండుగుట్ట నుండి గద్దెల మిదకు తీసుకురాను న్నట్లు వివరించారు. 23న ఇరువురు అమ్మవారులు గద్దెల పై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 24 సమ్మక్క-సారలమ్మలు తిరిగి వన ప్రవేశం చేయనున్నట్లు తెలిపారు.లక్షమందికి పైగా వచ్చే జాతరకు ఎలాంటి ఆటంకలు జరగకుండా ఆలయ కమిటి సభ్యులు ఈశ్వర మ్మ, రాంబాబు, అంజయ్య, సారయ్య, వెంకటేశ్వర్లు, యద య్య, రాజు, బాలకృష్ణ, వీరమ్మ, సందీప్, పవన్, గుర్వమ్మ, గౌతం రాజు, కల్తీ రమేష్, అలేం రాంబాబు, నాగబాబు, రాంబాబు తదితరులు ఆధ్వర్యంలో టీంలను ఏర్పాటు చే శామని తెలిపారు. ఇప్పటికే రోజు వందల మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తున్నారని వివరించారు.

భక్తులతో పులకించిన జాతర

» జూలూరుపాడు, ఖమ్మం రూరల్‌లో కొనసాగుతున్న సమ్మక్క- సారక్క జాతర » రెండో రోజు గద్దెపైకి చేరిన సమ్మక్క



జూలూరుపాడు/ఖమ్మం రూరల్, ఫిబ్రవరి15: భక్త జన సందోహంతో సమ్మక్క - సారలమ్మ జాతర పులకించిపో యింది. మండలంలోని పడమటనర్సాపురంలో రెండో రోజు గురువారం వన దేవతల జాతర సాగింది. గి రిజన పూజారులు సాయంత్రం వనం నుంచి సమ్మక్కను తీసుకొని వచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివి ధ ప్రాంతాలకు చెందిన ప్రజలు జాతరలో పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. సమ్మక్క - సారలమ్మలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తు లు అధిక సంఖ్యలో హాజరవడంతో పండుగ వాతావరణం నెలకొంది. పుట్ట బంగారాన్ని అమ్మ వార్లకు సమర్పించి తమ భక్తి పరవశ్యాన్ని చాటుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు, వివిధ జిల్లాలకు చెందిన భక్తులు జాతరలో పాల్గొని వన దేవతలకు ప్రత్యేక పూజలు చేసి బోనాలను సమర్పించారు.

మద్దులపల్లిలో రెండో రోజు మినీ మేడారం జాతర

ఖమ్మం రూరల్: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సమ్మక- సారలమ్మల గద్దెలవద్ద మినీ మేడారం జాతర రెండోరోజు గురువారం ఘనంగా సాగింది. భక్తులు, పూజారి గ్రామంలోని కోతులగుట్టపై ఉన్న కాళికామా త ఆలయం నుంచి సమ్మక్కను దివ్య రథంపై గద్దెమీదకు తీసుకువచ్చారు. డప్పువాయుద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, శివసత్తులు, గిరిజన, కొమ్ము నృత్యాలతో అలరించారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలు తల్లంపాడు, తెల్దారుపల్లి, ఆరెంపుల, గుర్రాలపాడు, గుదిమల్ల, వెంకటగిరి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆళయ కమిటి ఆధ్వర్యంలో మహ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సైదులు స్వామి, గ్రామ పెద్దలు అంబటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.





జూలూరుపాడులో మొక్కులు చెల్లించుకోవడానికి వస్తున్న భక్తులు, ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో..

చిన్నారి వైద్యానికి రూ.లక్ష వితరణ

» స్నేహితుల తల్లిదండ్రుల ఔదార్యం

అశ్వాపురం ఫిబ్రవరి 15: ఓ చిన్నారి వైద్యం కోసం... ఆచిన్నారి స్నేహితుల తల్లితం డ్రులు చేయి, చేయి కలిపి రూ.1,01,220లు వితరణగా గురువారం అందజేశారు. వివ రాలు.. తురుమలగూడెం తండాకు చెందిన తేజావత్ శంకర్ కుమార్తె చిన్నారి హరి ణి(7) గౌతమీనగర్ కాలనీలోని ఓ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఇటీవల హరిణి తీవ్ర అనారోగ్యానికి గురయ్యింది. తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించగా లిసో ప్లాస్టి లుకేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తెలిపారు. కాగా శంకర్ నిరుపేద రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. దీం తో చిన్నారితో పాటు చదువుకునే స్నేహితుల ద్వారా చిన్నారి పరిస్థితి తెలుసుకున్న త ల్లితండ్రులు చేయిచేయి కలిపి తమ ఔదార్యం చాటుకున్నారు. తమ కుమార్తె వైద్యం కోసం స్పందించిన దాతలకు శంకర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

● మహిళ మృతి, మరో ఇద్దరికి గాయాలు

వైరా, పిబ్రవరి 15: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టగా ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతిచెందడంతో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన సోమవరం-తాటిపూడి గ్రామాల మధ్య గురువారం రాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గంధపు వరలక్ష్మీ (45) తాటిపూడి గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి తన స్వగ్రామానికి వెళ్లేందుకు వైరా వరకు ఆటోలో బయలుదేరింది. వారు ప్రయాణిస్తున్న ఆటో తాటిపూడి గ్రామ సమీపంలోని గోదాము సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఆటోలో ఉన్న వరలక్ష్మీ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న ఉదయ్‌కిరణ్‌తో పాటు మరో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సం ఘటన ఖమ్మం రూరల్ మండలం, సీతారామపురం గ్రామంలో గురువారం చో టుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారామపురం గ్రామానికి చెం దిన చంద్రయ్య (50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చాతిలో నొప్పిగా ఉం దని ఆసుపత్రికి వెళ్తున్నాని చెప్పి బయటకు వెళ్లాడు. ఆరోగ్య పరిస్థితులు తట్టుకోలేక గ్రామ శివారులోకి వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వెం టనే ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు చంద్రయ్య మృతి చెం దా డు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిని కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని చితకబాదారు..

● ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్లలో ఘటన

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15: ఒంటరిగా ఉన్న బాలుడిని అపహరించడానికి యత్నించాడని ఓ గుర్తుతెలియని వ్యక్తిని గ్రామస్థులు పట్టుకుని చితకబాదిన సంఘటన గురువారం సాయంత్రం ఖమ్మం జిల్లా రూరల్ మండలం గుదిమళ్లలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గుదిమళ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఇల్లు గ్రామానికి చివరన ఉంది. ఇంటి పక్కనే పంట పొలాలు ఉంటాయి. వెంకటేశ్వర్లు కుమా రుడు రెండేళ్ల బాలుడు ఇంట్లో పడుకుని ఉండగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివ రామ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి వెంకటేశ్వర్లు భార్యపై దాడి చేసి బాలుడిని ఎత్తు కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇంతలో వెంకటేశ్వర్లు భార్య, ఆ బాలుడు గట్టిగా కేకలు వేయ డంతో అతడు బాలుడిని వదిలిపెట్టి పారిపోతుండగా చుట్టుపక్కలవారు వచ్చి శివ రామ్‌సింగ్‌ను వెంబడించి పట్టుకుని చితకబాదారు. వెంటనే పోలీసులకు సమాచారం అం దించి అతడిని పోలీసులకు అప్పగించారు. శివరామ్ సింగ్‌తో పాటు వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం శివరామ్ సింగ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీనికి సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుండెపోటుతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ మృతి

● బస్సు నడుపుతుండగా ఛాతి నొప్పి ● చికిత్స పొందుతూ దుర్మరణం

కల్లూరు, ఫిబ్రవరి 15: గుండెపోటుతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతి చెందిన సంఘటన కల్లూరులో చోటు చేసుకుంది. సత్తుపల్లి ఆర్టీసీ బస్సు డిపో పరిధిలో అద్దె బస్సు నడుపుతున్న డ్రైవర్ కాకాని శ్రీనివాసరావు(46) సత్తుపల్లి నుంచి ఖమ్మానికి ఉదయం 5గంటల సమయంలో బయలుదేరారు. కాగా శ్రీనివాసరావు డ్రైవింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో గ్యాస్ నొప్పి అని భావించి ప్రయాణికుల దగ్గర నుంచి గ్యాస్ టాబ్లెట్ అడిగి తీసుకున్నాడని తెలిపారు. అనంతరం కల్లూరులో ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం లోపలకు వచ్చి కూర్చీలో కూర్చొనుండగా ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందాడని తెలిపారు. మృతుడిది వేంసూరు మండలం రామన్నపాలెం, కాగా భార్య కుమార్తె ఉన్నారు.

స్టాటిస్టిక్స్, గణితంపై ఆసక్తిపెంచుకోవాలి: ప్రొ. హరగోపాల్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 15: స్టాటిస్టిక్స్, గణితంపై విద్యార్థులు ఆసక్తి పెంచు కుని, ఆయా సబ్జెక్టులలో రాణించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ రిటైర్డ్ ప్రొఫెసర్ వీవీ హరగోపాల్ తెలిపారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మ హిళా గురుకుల డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'అప్లికేషన్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమ్యాటిక్స్' అనే అంశంపై సెమినార్‌ను గురువారం ప్రారం భించారు. హరగోపాల్ మాట్లాడుతు స్టాటిస్టిక్స్, గణితంపై సబ్జెక్టులలో ఉద్యోగ అవకా శాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ అనే అంశం పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆచార్య నాగార్జున, తెలంగాణ యూనివర్సిటీల ప్రొఫెసర్లు జ్ఞానేశ్వర్, సంపత్‌కుమార్, తిరుపతిలోని జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయ ఆచార్యుడు చందులాల్ మాట్లాడారు. మ్యాథమెటిక్స్ గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌బీజీఎన్ కళాశాల అధ్యాపకుడు సాంబశివరావు, ఆర్‌సీఓ ప్రత్యూష, కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు: రేంజర్ స్నేహలత

● చంద్రాయపాలెంలో పోడు అడ్డగింత

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 15: అటవీ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కేసులు పెడతామని అటవీ శాఖ రేంజర్ స్నేహలత హెచ్చరించారు. గురువారం సత్తుపల్లి అటవీ రేంజ్ పరిధిలోని యాతాలకుంట సెక్షన్‌కు చెందిన చంద్రాయపాలెం బీట్‌లోని 350కంపార్ట్‌మెంట్‌కు చెందిన స్థలంలో సమీపంలోని ప్రజలు పోడు కొడుతున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ రేంజర్ స్నేహలత అధికారులతో కలిసి అక్కడికి చేరుకుని అడ్డుకోబోగా, వారిపై వాగ్వాదానికి దిగారు. పోడు కొడుతున్న చంద్రాయపాలెం ముత్యాలమ్మతల్లి గుడి వెనుక ప్రాంతం ప్రభుత్వానికి చెందిన అసైన్‌మెంట్ భూమి అని, ఇక్కడ తాము నివాసం ఉండేందుకు పోడు కొడుతున్నామని, ఐదేళ్లుగా ఆక్రమించేందుకు వస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రాయపాలెం, బుగ్గపాడు, గాంధీనగరం, రుద్రాక్షపల్లి, దమ్మపేట మండలంలోని నాగుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 150మంది తమపై దౌర్జన్యానికి దిగుతూ అటవీ భూమికి ఆక్రమించేందుకు పోడు కొట్టగా అ డ్డుకున్నామని తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసిన అనంతరం ఉన్నత అధికారులకు నివేదికను అందిస్తామని పేర్కొన్నారు. అప్పటివరకు ఈ భూమిలో ప్రవేశించినా, పోడు కొట్టినా చట్టరీత్యా చర్యలుతీసుకుంటామని చెప్పారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 15: టైర్ పేలి కారు చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం సత్తుపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక జేవీఆర్ ఓసీ ఉద్యోగి కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి కారులో వస్తున్న క్రమంలో మండలంలోని రుద్రాక్షపల్లి శివారులోకి రాగానే వాహనం టైర్ పేలడంతో పల్టీకొట్టి అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా ఎవ్వరికి ప్రమాదం జరగలేదు.

చేగొమ్మ క్రాస్‌రోడ్డు వద్ద రెండు బైక్‌ల ఢీ

కూసుమంచి, ఫిబ్రవరి 15: మండలంలోని చేగోమ్మ క్రాస్‌రోడ్డు ప్రెట్రోల్ బంకు వద్ద రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం గురువారం రాత్రి బంకు సమీపంలో చీకట్లో కనిపించకపోవడంతో.. ప్ర మాదవశాత్తు రెండుబైక్‌లు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జగ్నాల్‌తండాకు చెందిన జర్పుల మోతీలాల్‌కు, ధర్మాతండాకు చెందిన వడిత్య మేగ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘట న స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మతం ముసుగులో మోసం.. ● రూ.ఆరు లక్షలకు టోకరా

వైరా, ఫిబ్రవరి 15: ముందు మతం పేరిట ఆకర్షించారు... ఆతర్వాత తమను నమ్మిన పేదలు, అమాయకులకు ఆర్థిక లబ్ధి చేకూర్చుతామని నమ్మించారు. దాన్ని అవకాశంగా భావించి తమను నమ్మిన వారిని నట్టేట ముంచారు. రూ.ఆరు లక్షల వరకు టోకరా పెట్టిన సంఘటన మండల పరిధిలోని తాటిపూడి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలంలోని ఊటుకూరుకు చెందిన ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలు రెండునెలల కిందట తాటిపూడి గ్రామానికి వచ్చారు. ఒక రైతు ఇంటివద్ద మతం పేరిట ప్రార్థనలు నిర్వహించారు. తమ దగ్గరకు వచ్చిన వారికి మొదట కొద్దిమొత్తంలో నగదు ఇతరత్రా బహుమానాలు ఇచ్చారు. విందు, వినోదాలు కూడా ఏర్పాటు చేశారు. ఇక అతర్వాత ఆ ముగ్గురు తమ మోసానికి తెరదీశారు. ప్రార్థన చేసిన వారిని నమ్మిన పేదలు, అమాయకులు వారి ప్రలోభాలకు లోనయ్యారు. వారి చేతిలో నష్టపోయిన వారు 200మందికిపైగానే ఉన్నారు. ఈ ముగ్గురు మోసకారులు వితంతువులు, దివ్యాంగులపైనే దృష్టిసారించారు. రూ.500చెల్లించిన వారికి రూ.వెయ్యి, రూ.3వేలు చెల్లించిన వారికి రూ.4నుంచి 5వేలు, రూ.10వేలు చెల్లించిన వారికి రూ.50వేలు, రూ.30వేలు చెల్లించిన వారికి రూ.రెండులక్షల చొప్పున పింఛన్ ఇస్తామని, వాహనాలు సమకూర్చుతామని నమ్మించారు. దాంతో వారిని నమ్మిన ఎక్కువ మంది రూ.500చొప్పున, మరికొంతమంది రూ.3వేల చొప్పున, కొద్దిమంది రూ.10వేలు, రూ.30వేల చొప్పున రూ.ఆరులక్షల వరకు సమర్పించుకున్నారు. ఆతర్వాత ఒక్కొక్కరుగా తాటిపూడి నుంచి పలాయనం చిత్తగించారు. తాటిపూడికి పైముగ్గురు మోసగాళ్లను పరిచయం చేసిన ఖమ్మానికి చెందిన వారిని బాధితులు కొంతమంది నిలదీశారు. మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేవోసీ ప్రభావిత ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

» కలెక్టర్ ప్రియాంక » కోయగూడెం ఓపెన్‌కాస్ట్ -2 ప్రాజెక్టు విస్తరణపై పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

టేకులపల్లి, ఫిబ్రవరి 15: కేవోసీ ప్రభావిత ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కృషి చేస్తానని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. కేవోసీలో గురువారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కోయగూడెం ఓపెన్‌కాస్ట్-2 ప్రాజెక్టు-2 విస్తరణపై జరిగిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆమె పాల్గొన్నారు. కేవోసీ ప్రభావిత ప్రాంత గ్రామాల్లో తాగునీరు కల్పించడం, హెల్త్ క్యాంపులు నిర్వహించడం, పర్యావరణ పరిరక్షణలో సింగ రేణి సంస్థ విఫలం చెందిందని, ఇతర సమస్యలను ఆయా గ్రామాల ప్రజలు, సంఘాల నాయకులు సభ దృష్టికి తీసి కొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక మాట్లా డుతూ ప్రభావిత గ్రామాలలో సింగరేణి సంస్థ ఆధ్వ ర్యంలో తాగునీరు ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. సాగునీరు అందించేందుకు లచ్చగూడెం గడ్డిచెరువు, తెల్ల వాగు చెరువుల్లోకి కేవోసీలోని నీరును మళ్లించే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. కోల్‌ట్రాన్స్‌పోర్టులో స్థానిక లారీ యాజమానులకు ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కేవోసీలో స్థానికులతోనే కాంట్రాక్టు కార్మికు లను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకొంటామన్నారు. సింగరేణి డీఎంఎఫ్‌డీ నిధుల నుంచి ఈ ప్రాంత అభివృద్ధి పనుల కోసం ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తామ న్నారు. ఈ విషయాలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు స్పష్టం ఆమె చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్, కేవోసీ పీవో ప్రహ్లాద్, సింగరేణి ఇతర అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.రవీందర్, అధికారులు, వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు తదిత రులు పాల్గొన్నారు.

గురుకులంలో మూడు ఉద్యోగాలకు ఎంపిక మమత



ఖమ్మం ఖానాపురంహవేలి/కూసుమంచి ఫిబ్రవరి 15: గురుకుల బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో కూసుమంచి మండలం ముత్యాలగుడెం గ్రామానికి చెందిన బొల్లికొండ మమత మూడు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపింది. లైబ్రరి సైన్స్ విభాగంలో స్కూల్ లైబ్రేరియన్, డిగ్రీ కాలేజ్ లైబ్రేరియన్, జూనియర్ కళాశాల లైబ్రేరియన్ గా ఎంపికైనట్లు మమత తెలిపారు. కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ ఉద్యోగాలు సాదించిన మమతను పలువురు అబినందించారు.

29న చిరుధాన్యాలపై అవగాహన, ప్రదర్శన

» మార్చి 10న సూప్రింకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణకు ఖమ్మంలో సన్మానం

» కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు



మాట్లాడుతున్న ఎర్నేని రామారావు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 15: చిరుధాన్యాలు వినియోగించడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని దానిలో ఎన్నో ఆరోగ్య సూత్రాలు దాగివున్నాయని వాటిని రోజు సరైన సమయంలో సమపాళ్లలో తీసుకోవటం వలన ఆరోగ్యం మహాబాగ్యంగా ఉంటుందని కమ్మమహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కళ్యాణ మం డపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న చిరుధాన్యాలపై ప్రత్యేక ప్రయోగాలు చేసిన డాక్టర్ ఖాదర్‌వల్లీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో చిరుధాన్యాలపై అవగాహన, రకరకాల చిరుధాన్యాల ప్రదర్శన, ప్రత్యేక చిరుధాన్యాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాలపై అవగాహన ఉన్నవారు, వాటివల్ల కలిగే లాభాలను తెలుసుకునేందుకు తప్పక హాజరుకావాలని తెలిపారు.

మార్చి 10ఖమ్మం నగరానికి సూప్రింకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ వస్తున్నారని ఆ రోజు ఆయనను కులమతాలకు, రాజకియాలకు అతీతంగా సన్మాన కార్యక్రమం ఉంటుందని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. అదేవిదంగా రేణుకాచౌదరికి రాజ్యసభ సభ్యురాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించినందుకు ప్రభుత్వానికి, రేణుకాచౌదరికి ఖమ్మం మహాజన సంఘం తరుపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి గొడపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలి

» భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్



నివాళులర్పిస్తున్న పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 15: బంజార జాతి ఆరాధ్య దైవం సంత్ సే వాలాల్ మహారాజ్ మహనీయుడు అని, సేవలాల్ మహారాజ్ అడుగుజా డలో నడవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం భద్రాచలం లోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా ఆలిండియా బంజారా సేవా సంఘం భద్రాచలం ఆధ్వర్యంలో బోగ బండా రో కార్యక్రమం నిర్వహించారు. పీవో ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం అంద రం పాటుపడాలని, లంబాడీలు దేవుడిగా భావించి సంత్ సేవాలాల్‌ను కొలుస్తారని, సే వాలాల్ జంతుబలికి తీవ్ర వ్యతిరేకి అని, తల్లిదండ్రులను, మహిళలను గౌరవించాలని ప్రజలకు ఆయన బోధించారు. ప్రకృతిని వన్య ప్రాణులను పరిరక్షించడం ద్వారా మానవ జన్మ సార్ధకత చేకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఆర్డీవో మంగీలాల్, భద్రాచలం మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి.శివాజీ, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఓసీ బాధితులను సింగరేణి పట్టించుకోవడంలేదు..

» అసెంబ్లీలో ప్రస్తావించిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి » కొద్ది గంటల్లోనే సీహెచ్‌పీని సందర్శించిన సింగరేణి అధికారులు



సత్తుపల్లి, ఫిబ్రవరి 15: సత్తుపల్లి మండలంలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గురువారం అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ ద్వారా ఉత్పత్తి ఐనా బొగ్గు లోడింగ్ సందర్భంగా వెలువడుతున్న కాలుష్యం వలన ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇతర సమస్యలను కూడా ప్రస్తావించారు. ఆమె అసెంబ్లీలో మాట్లాడిన కొద్దిగంటల్లోనే సింగరేణి ఉన్నతాధికారులు సైలోబంకర్‌ను సందర్శించి సమస్య పరిష్కారంపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు.

ఎమ్మెల్యే రాగమయి ప్రస్తావించిన సమస్యలు


సత్తుపల్లి మండలంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులు నడుస్తున్నాయని, వీటివలన స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన వారికి సరైన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. నిర్వాసితులకు ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని హామీలు ఇచ్చారు. అమలు కాలేదన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని అన్నారు. సింగరేణి నిధులను రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు మళ్లించారు. ప్రభావిత గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా సంస్థ కంటితుడుపు చర్యల వలన మంచినీళ్లు సక్రమంగా అందడం లేదన్నారు. కిష్టారంలో నిర్మించిన సీహెచ్‌పీ ద్వారా బొగ్గు లోడింగ్ చేస్తున్నారని, దీనివలన స్థానికంగా ఉన్న కాలనీ వాసులు కాలుష్యంతో ఊపిరితిత్తుల సమస్యల బాధపడుతున్నార ని, అయినా పట్టించుకోవడం లేదని అన్నారు. స్థానికంగా ఉన్న 300 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని కోరినా పట్టించుకోవడం లేద న్నారు. కాలుష్యం బారిన పడిన కుటుంబాలను పునరావాసం కల్పించి వేరే ప్రాంతంలో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి నిర్మించాలని కోరారు.

కొద్దిగంటల్లోనే సీహెచ్‌పీని సందర్శించిన అధికారులు

అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి బొగ్గు లోడింగ్ సందర్భంగా వె లువడే కాలుష్యం వలన స్థానికంగా 300 కుటుంబాల వారు ఊపిరితి త్తుల వ్యాధితో బాధపడుతున్నారని ప్రస్తావించిన కొద్దిగంటల్లోనే సింగరే ణి అధికారులు కిష్టారం వద్ద సీహెచ్‌పీని సందర్శించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు జేవీఆర్ సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ కే.సోమశేఖరరావుతో కలిసి సీహెచ్‌పీని సందర్శించారు. కోల్ రేకుల లోడింగ్ అవుతున్నప్పుడు బంకర్ల నుంచి బొగ్గు సైలోబంకర్లకు వెళ్లినప్పుడు దుమ్ము రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించా రు. వారం రోజులలో వాటర్ మిస్ట్ కెనాన్‌లను, వాటర్ మిస్ట్ స్ప్రే సిస్టిమ్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, కోల్ స్టోరేజ్ బంకర్లలో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏడాది కాలంగా ఇక్కడ బొగ్గు లోడింగ్ సందర్భంగా దుమ్ము వెలువడుతుండగా పలు సందర్భాలలో స్థానికులు ఆందోళన చేశారు. ఎప్పటికప్పుడు వారికి నచ్చజె బుతూ సింగరేణి అధికారులు కాలం వెళ్లదీశారు. చివరికి గురువారం ఉదయం ఈ సమస్యను ఎమ్మెల్యే రాగమయి అసెంబ్లీలో ప్రస్తావించిన కొద్ది గంటల్లోనే అధికారులు స్పందించడం విశేషం. ఇప్పటికైనా సమస్యకు శాశ్విత పరిష్కారం జరగాలని స్థానికులు కోరుకుంటున్నారు.



కిష్టారం సీహెచ్‌పీని సందర్శించిన సింగరేణి అధికారులు



గుడిపాడులో ఘనంగా జలాధివాసం



సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి15: సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడులో ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జలాధివాసం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు వేలాదిగా అంబేద్కర్ విగ్రహం నుంచి ఆలయం వరకు బిందెలతో తరలివచ్చారు. రాత్రి జలాధివాసం హోమం సందర్భంగా శ్రీసుబ్రహ్మణ్య హోమం, ప్రదోష కాలార్చన, నీరాజన మహాయంత్ర పుష్ప సమర్పణ, దర్బారుసేవ, యాగశాల బలిహరణ, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల18న ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ ఆహ్వానించింది.

డ్రామా, విజార్డ్ పోటీలో పిండిప్రోలు విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి15: ఇంగ్లీష్ టీచర్స్ అసోషియేషన్ నిర్వహించిన డ్రామా, స్పెషల్ విజార్డ్ పోటీలలో పిండిప్రోలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ సుజాత తెలిపారు. ఈనెల 13న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీహెచ్ కృష్ణ గాయత్రి స్పెల్ విజార్డ్‌లో ప్రథమబహుమతి, లోహితలావణ్య జవేరియ, యామిని, కృష్ణగాయత్రి డ్రామాలో ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీఈవో సోమశేఖరశర్మ విజేతలకు బహుమతులు అందించారు.

రోడ్లకు రూ.1.87 కోట్లు మంజూరు

చింతకాని, ఫిబ్రవరి15: గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ఉపాధిహామీ నుంచి రూ 1.87 కోట్ల నిధులు మంజూరి అయినట్లు ఎంపీపీ పూర్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని 25 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు.

శాఖాపర లక్ష్యాలను పూర్తి చేయాలి

- ప్రణాళికాయుతంగా పనిచేయాలి
- కలెక్టర్ వీపీ గౌతమ్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి15: శాఖాపరమైన లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బదిలీపై జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలతో ఆయన ఈ సమీక్ష జరిపారు. మండల స్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన సేవలతో మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యాయుతంగా పని చేయాల్సిన సూచించారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉందని వారికి మార్గనిర్దేశం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించాలని కలెక్టర్ గౌతమ్ చెప్పారు. ఎన్నికల సమయం కావడంతో అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ పనులు లేనందున ఉపాధి హామీ పనులపై ఆధారపడతారని, ప్రతిఒక్కరికి పని కల్పించాలని అన్నారు. ప్రతీ మండలంలో కనీసం 5 వేల ఉపాధి హామీ కూలీలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్ట్ రాస్తాలో భాగంగా గ్రామాల్లోని డొంకల ఆక్రమణలు తొలగించి, రహదారి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 1058 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఇంకా 390కు క్యాప్చరింగ్ చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఎస్. వినోద్, ఆర్. డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో హరికిషన్, జిల్లాపౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, లాండ్‌సర్వే ఏడి శ్రీనివాసులు, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, డిప్యూటీ సీఈవో బి.నాగలక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ దరఖాస్తులపై అవగాహన ఉండాలి

ఖమ్మంకలెక్టరేట్: ఐటి దరఖాస్తులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని భారత ఎన్నికల సంఘం సెక్రెటరీ సందీప్‌కుమార్ అన్నారు. గురువారం దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల అర్‌వోలు, ఏ అర్‌వోలతో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో వినియోగించనున్న ఐటీదరఖాస్తులు, సున్న ఈఎస్ఎంఎస్, సీవీజిల్, ఎంకోర్ దరఖాస్తులపై మాస్టర్ ట్రైనర్ సంతోష్ అవగాహన కల్పించారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం ఆర్‌డీవో గణేష్, ఏస్డీసీరాజేశ్వరి, ఖమ్మంఅర్బన్, రూరల్ తహసీల్దార్ స్వామి, రామకృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

గ్రామీణ లింకు రోడ్ల సర్వే



చింతకాని, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని పలు గ్రామీణ లింకు రోడ్లను పంచాయతీ రాజ్ డీఈ కోటేశ్వరరావు పరిశీలించారు. గాంధీనగర్, బొప్పారం, మత్కేపల్లి నామవరం, తిమ్మినేనిపాలెం, చిన్నమండవ గ్రామాల్లో గ్రామీణలింకు రోడ్లను బీటీ రహదారులుగా నిర్మించాలని ప్రజల నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతులు రావడంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం పీఆర్ సిబ్బంది లింకు రోడ్ల సర్వే చేపట్టారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో నూతన రహదారులు నిర్మాణంతో పాటు రాష్ట్ర సరిహద్దు గ్రామం చిన్నమండవ నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామం పోలంపల్లికు రహదారి ఏర్పాటుకు సర్వే నిర్వహించారు.

యూబీఐలో ప్రమాద బీమా సదుపాయాలు



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ శ్రీలక్ష్మీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి15: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారులుగా చేరి ప్రమాద బీమాగా రూ.30లక్షలు పొందవచ్చునని బ్రాంచ్ మేనేజర్ జీ.శ్రీలక్ష్మీ అన్నారు. గురువారం స్థానిక బ్రాంచ్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 15న ఖాతాదారు ఒకరిని ఎంపిక చేసి సన్మానిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సన్మానగ్రహీత రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ముజాహిద్, రామకృష్ణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ: ఖాతాదారుల సంక్షేమమే యూనియన్ బ్యాంకు ధ్యేయమని సీనియర్ మేనేజర్ బి.అపురూప అన్నారు. గురువారం స్థానిక బ్యాంకు ఆవరణంలో ఖాతాదారుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ మేనేజర్ పి.వెంకటబాబు, ఫీల్డ్ ఆఫీసర్ గజేంద్ర, అసిస్టెంట్ మేనేజర్ జి.మోహన్, క్యాషియర్ రామకృష్ణ, సురేష్, శ్రీనివాస్, సుధానాయుడు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలో గల యూనియన్ బ్యాంక్‌లో ఆ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఖాతాదారుడు స్వాతంత్ర సమరయోధుడైన వేమిరెడ్డి వెంకటరెడ్డిని మేనేజర్ ఎస్.శ్రీనాధ్ సన్మానించారు.

ఖమ్మంవ్యవసాయం: యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఖాతాదారులకోసం ఖాతాదారుల సేవా సమావేశం ఖమ్మం రీజియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజియన్ హెడ్, డిప్యూటి జనరల్ మేనేజర్ హనుమంతరెడ్డి బ్యాంకు సేవలను వివరించారు. పలువురు ముఖ్య ఖతాదారులను సన్మానించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

తల్లాడ, ఫిబ్రవరి15:పీఎంకిసాన్ ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని సత్తుపల్లి ఏడీఏ యు.నర్సింహారావు కోరారు. గురువారం తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. మండలంలో 231మంది రైతులు ఈకేవైసీ, మరో 248మంది రైతులు ఆధార్ కార్డును బ్యాంకుకు అనుసంధానం చేసుకోవాల్సి ఉందన్నారు. త్వరితగతిన సంబంధిత ఏఈవోలను లేదా సీహెచ్‌సీ కేంద్రాల ద్వారా ఈకేవైసీ పూర్తిచేసుకొని పీఎం కిసాన్ లబ్ధి పొందాలని వివరించారు. కార్యక్రమంలో ఏవో ఎండీ.తాజుద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత వైరాజట్టు

వైరా, ఫిబ్రవరి15: వైరాలోని బీసీ కాలనీ సమీపంలో 15 రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ప్రథమ బహుమతి ఆర్‌సీఎం చర్చి వైరా జట్టు, ద్వితీయ బహుమతి లింగన్నపేట పాషా జట్టు, తృతీయ బహుమతి ఎల్‌ఆర్‌వన్ ప్యామిలీ జట్టు, నాల్గో బహుమతి ఎస్సీకాలనీ శాంతినగర్ జట్లు గెల్చుకున్నాయి. క్రికెట్ విజేతలకు అయిలూరి జగన్మోహన్‌రెడ్డి, మరికంటి శివ బహుమతులు అందజేశారు. పోటీల కన్వీనర్ మద్దెల సెల్వరాజు, భరత్, రమేష్, మధు, సురేష్, బుజ్జీ, లాలా పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

పెనుబల్లి, ఫిబ్రవరి15: జోనెబోయిన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా నూతిపాడు గ్రామానికి చెందిన గామోసు ఏసుబాబుకి గురువారం ట్రైసైకిల్‌ను అందజేశారు. పుట్టుకతో కాళ్లు చచ్చుబడంతో నడవలేని స్థితిలో ఉండటంతో ట్రస్ట్ నిర్వాహకురాలు జోనెబోయిన అన్నపూర్ణ ట్రైసైకిల్‌ను అందజేశారు.

విందు వేడుకలకు ముస్తాబైన పీఎస్ఆర్ ప్యాలెస్

కల్లూరులో ఘనంగా ఏర్పాట్లు





కల్లూరులో విందు వేడుకలకు ముస్తాబైన పీఎస్ఆర్ ప్యాలెస్

కల్లూరు, ఫిబ్రవరి 15: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కుమారుడి వివాహ విందు వేడుకఈనెల18 కల్లూరులో(నారాయణపురం)లో అట్టహాసంగా జరగనున్నది. ఇందుకోసం తిరువూరు క్రాస్ రోడ్డు వైపున గల 60ఎకరాల్లో ఎంకే ఆర్కిటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో భారీసెట్టింగ్‌లతో పీఎస్ఆర్ ప్యాలెస్ ముస్తాబైంది. ఫిలింఆర్టిస్టు డైరెక్టర్ మల్లికార్జునరావు నేతృత్వంలో సూమారు 300మంది సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఫిలింసిటిని తలపించేలా ప్యాలెస్ ఆలయ ముఖద్వారం, గర్భగుడి, మండపం, 5 వరుసల్లో ప్యాలెస్ లైట్లు, లైవ్‌ప్యాలెస్, జలపాతం తలపించేలా సెట్టింగ్, ట్రిగార్డెన్ ఏర్పాట్లు చేశారు. ప్రముఖులతో కలుపుకొని 2లక్షల మందికి ఏర్పాట్లు చేస్తున్నారు. భోజన శాలలు, విందు వేడకలను తిలకించేలా అతిథుల కోసం ప్రత్యేక గ్యాలరీలు కూడా ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎంకే ఆర్కటెక్ట్ వారు పొంగులేటి వారి కుటుంబంలో జరిగిన విందు వేడల్లో ఇది మూడవ ప్యాలెస్‌గా చేపట్టారు. మరో 50 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ కూడా సిద్ధం చేస్తున్నారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

కొణిజర్ల, ఫిబ్రవరి15: విద్యార్థులంతా చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పోటీ పరిక్షల్లోను పాల్గొనాలని డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. గురువారం మండల పరిధిలోని సింగరాయపాలెం ఉన్నత పాఠశాలలో బిగ్‌హెల్ప్‌వారి ఆధ్వర్యంలో మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ కోఆర్డీనేటర్ కె.రామారావు, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాదించాలని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక ప్రకారం విద్యా బోధనను చేయాలన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తల్లాడ, ఫిబ్రవరి15: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మండల వైద్యాధికారి రత్నమనోహర్ సూచించారు. గురువారం తల్లాడ మండలం నూతనకల్, మిట్టపల్లి గ్రామాల్లో వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భస్థ సమయంలో ప్రతీ స్త్రీ నాలుగుసార్లు వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. మందుల క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు రావన్నారు. తాజా ఆకుకూరలు, పాలు, పండ్లు, కర్జూరం, పల్లీపట్టీ తీసుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ వ్యాయామం చేయడం వల్ల సహజ ప్రసవం అవుతుందని వైద్యాధికారి రత్నమనోహర్ చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు భాస్కర్, కె.పెద్దపుల్లయ్య, మీరమ్మ, భద్రమ్మ, రాజశ్రీ, అన్నపూర్ణ, శిరీష పాల్గొన్నారు.

రేణుకను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



రేణుకను సన్మానిస్తున్న కట్ల రంగారావు తదితరులు



రేణుకాచౌదరిని కలిసిన జిల్లా కాంగ్రెస్‌నాయకులు

వైరా, ఫిబ్రవరి15: రాజ్యసభ సభ్యురాలిగా గురువారం నామినేషన్ వేసిన కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరిని వైరా కాంగ్రెస్ నాయకులు సన్మానించి అభినందించారు. కాంగ్రెస్ నాయకుడు కట్ల రంగారావు ఆధ్వర్యంలో రేణుకాచౌదరి నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లారు. నామినేషన్ దాఖలుకు ముందు రేణుకాచౌదరిని కట్ల రంగారావు ఇతర కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కట్ల నాగరాజు, సంతోష్, నంద్రు నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, పానెం భాస్కర్, గుత్తికొండ వీరబాబు, కట్ల సాయి, షేక్.మోసిన్, అబ్బూరి కాంతయ్య, యామాల భాస్కర్, గున్నాల అను, కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ నాయకులు అభినందనలు

ఖమ్మం సంక్షేమవిభాగం: కేంద్రమాజీ మంత్రి రేణుకా చౌదరికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ అభినందనలు తెలిపారు. రాజ్యసభ సభ్యురాలిగా కాంగ్రెస్ నుంచి రేణుకాచౌదరికి టిక్కెట్ కేటాయించటంపై జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌కు వెళ్లి రేణుకాచౌదరి నివాసంలో ఆమేను కలిసుకొని పుష్పగుచ్ఛాలను అందించారు. ఖమ్మానికి రాజ్యసభ సీటు రావటానికి కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, ముస్తాఫా, స్రవంత్, సత్యగౌడ్, శ్రీనివాసరావు, కొండపల్లి మహేష్, యూసుఫ్, దేవళ్ల ప్రసాద్, దేవ్‌సింగ్, సమీర్ ఫాషా పాల్గొన్నారు.

ఏన్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు..

ఏన్కూరు: రేణుకాచౌదరిని గురువారం హైదరాబాదులో ఏన్కూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ధన్యవాదాలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు వక్కంతుల నాగార్జున, ఉప్పెర్ల ఆనందప్రసాద్, రాంబాబు, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు.

అలుపెరగని పోరాట యోధుడు ధర్మభిక్షం

- జయంతి వేడుకల్లో భాగం నివాళి



నివాళులు అర్పిస్తున్న బాగం, పోటు ప్రసాద్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి15: కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం తుదిశ్వాస వరకు అలు పెరగని పోరాటాలు చేసిన యోధుడు మాజీ ఎమ్మెల్యే, ఎంపీ ధర్మబిక్షం అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో గురువారం ధర్మబిక్షం 102వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయుధ పోరాటంలో ఎంతో కాలం పాటు రహస్య జీవితం గడిపారన్నారు. సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేగా నల్గొండ నుంచి ఎంపీగా గెలుపొంది ప్రజల సమస్యలను పరిష్కారానికి చట్టసభల్లో పని చేశారన్నారు. జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, ఎస్‌కే జానిమియా, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మీనారాయణ, యానాలి సాంబశివరెడ్డి, నూనే శశిధర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న కోసం పోస్టుకార్డుల ఉద్యమం

ఖమ్మం మామిళ్లగూడెం, ఫిబ్రవరి15: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ఆపార్టీ నాయకులు కేతినేని హరీష్ తెలిపారు. శుక్రవారం తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయం ఎదుట పోస్టుకార్డు ద్వారా రాష్ట్రపతి భవన్‌కి నందమూరి తారక రామారావు గారికి భారతరత్న ప్రకటించాలని అభ్యర్థిస్తూ భారీ ఎత్తున పోస్ట్‌కార్డ్ లు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ అభిమానులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



నేలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

నెట్‌వర్క్: నేలకొండపల్లిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, జిల్లా నాయకుడు కోటి హనుమంతరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రఘునాథపాలెం ప్రధాన రహదారి వెంట సేవాలాల్ జయంతిని గురువారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీఐ శ్రీహరి, ఏడీఈ శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వాంకుడోత్ దీప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవిరాథోడ్, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. వీఎంబంజర్‌లో వేడుకలు నిర్వహించారు. ధర్మావత్ మంగూనాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్, కార్యదర్శి కృష్ణనాయక్ పాల్గొన్నారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. కళాశాల హెచ్‌వోడీ జె.రమేష్, లంబాడీహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్ హాజరయ్యారు. కామేపల్లిలో లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు బోడా మంగ్యాజీ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం, బంజర, కంద్రిక గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

వారసత్వ ఆస్తిపై వివాహిత నిరసన

కొణిజర్ల,ఫిబ్రవరి15: తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిని తనకు ఇవ్వడంలేదని, మేనత్త కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని మండల పరిధిలోని బస్వాపురానికి చెందిన ముక్కపాటి జ్యోత్స్న పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆమె గురువారం గ్రామంలో తన ఇంటి ఎదుట భర్త పిల్లలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రాముతో ప్రేమవివాహం జరగటంతో మేనత్త, వారి కుటుంబం ఇబ్బందులు పెడుతున్నారని తెలిపింది. తన తల్లిదండ్రులు చనిపోయారని, అదే ఇంట్లో తను, నాయనమ్మతో ఉంటున్నామని ఫిర్యాదులో తెలిపింది. వివాహం తరువాత భర్తతో హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నామన్నారు. తన తండ్రి నిర్మించిన ఇంటివద్దకు వస్తే ఇబ్బందులు పెడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నది. ఇరువురి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

వనజీవికి మేయర్ పరామర్శ

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి15: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులను మేయర్ పూనకొల్లు నీరజ గురువారం పరామర్శించారు. కొరివివైపు వెళుతున్న ఆమె రామయ్య ఇంటి వద్ద ఆగి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కూసుమంచి, ఫిబ్రవరి 15: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కూసుమంచి సీఐ జనార్ధన్, ఎస్ఐ కిరణ్‌కుమార్‌ను మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామ శ్రీను, బజ్జూరి వెంకటరెడ్డి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, అర్వపల్లి జనార్ధన్, చిన్నం సంగయ్య, లింగారెడ్డి, బీష్మాచారి, సర్పంచి గుగ్గిళ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు క్వింటాళ్ల మిర్చి చోరీ

చింతకాని,ఫిబ్రవరి15: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పిన్నెల్లి శ్రీనివాస్ అనే రైతు గ్రామం సమీపంలోని కళ్లంలో మిర్చి పంటను ఆరబెట్టాడు. 13న అర్ధరాత్రి దొంగలు రెండు క్వింటాళ్ల మిర్చిని అపహరించారు.ఎస్ఐ కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

తల్లాడ,ఫిబ్రవరి15: మండల పరిధిలోని వెంగన్నపేట (గూడూరు)పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ బండారు ఏడుకొండలు(53)అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రూటు మార్చి.. ఏమార్చి అక్రమ ఇసుక రవాణా

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రిప్పర్లు

బోనకల్, ఫిబ్రవరి 15: ఆంధ్రా నుంచి తెలంగాణాకు కొంత కాలంగా అక్రమ ఇసుక రవాణా అడ్డు అదుపు లేకుండా కొనసాగుతుంది. వారం రోజుల క్రితం మైనింగ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న వారు బోనకల్ సరిహద్దు ప్రాంతంలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలోనే ఇసుక లోడ్ లారీలను ఆపి వేశారు. మరల రోజుల వ్యవధిలోనే బోనకల్ మీదుగా కాకుండ రూటు మార్చారు. ఎన్టీఆర్ జిల్లా దబ్బాకుపల్లి నుంచి ఇసుక లోడ్ టిప్పర్లను బోనకల్ మండలం చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల గ్రామాల మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముష్టికుంట్ల కోదండ రామాలయం వద్ద గురువారం ఇసుక టిప్పర్లను పట్టుకున్నారు. ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేశారు.

వైరా యూబీఐలో చిల్లర నాణేల మేళా



వైరా, ఫిబ్రవరి15: ఇటీవల కాలంలో ఏర్పడిన చిల్లర కరెన్సీ కొరతను తీర్చేందుకు బ్యాంకు అధికారులు ఉపక్రమించారు. చిల్లర కరెన్సీ నోట్ల స్థానంలో చిల్లర నాణెలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా గురువారం వైరాలో చిల్లర నాణెల పంపిణీ మేళా నిర్వహించారు. వైరా బ్యాంకు మేనేజర్ కె.కల్యాణ్‌రాజు దీన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ మేళాలో రూ.5, రూ.2, రూ.1 చిల్లర నాణెలను పంపిణీ చేశారు. ఒకేరోజు రూ.రెండులక్షల వరకు చిల్లర నాణెలను వ్యాపారస్తులు, అవసరాలు ఉన్న వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సురేష్, రవి పాల్గొన్నారు.

ప్రజాసేవకు పదవులు అవసరం లేదు

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేంసూరు, ఫిబ్రవరి15: ప్రజాసేవ చేసేవాళ్లకు పదవులు అవసరం లేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. గురువారం వెంకటాపురంలో తాజా మాజీ సర్పంచ్‌లను పూల మాలలు, శాలువాలతో సండ్ర సత్కరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు అధిక ప్రాధాన్యత కల్పించి బాధ్యతలు అప్పగించటం జరిగిందన్నారు.మాజీ సర్పంచ్‌లు పాలా వెంకటరెడ్డి, కుక్కపల్లి సుధాకర్, ముసలయ్య, మందపాటి సునీత, గరిగింటి మౌనిక, అచ్చేపల్లి సుహాసిని, గాయం సద్గుణావతి, సింగపోగు పద్మ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పదెకరాల వర్రి గడ్డివామి దగ్ధం

కల్లూరు, ఫిబ్రవరి 15: మండలంలోని పోచారం గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం సంభవించి పది ఎకరాల గడ్డి వాము దగ్ధమైంది. పోచారం గ్రామానికి చెందిన చింతలపూడి మాధవరావు అనే రైతు తన ఇంటి సమీపంలో వరి గడ్డిని వామిలా పేర్చారు. సమీపంలో కొంత మంది వ్యక్తులు చెత్తను కాలుస్తుండగా గాలికి నిప్పు రవ్వలు పక్కనే ఉన్న వరిగడ్డి వామిపై పడటంతో మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో రూ.70 వేలు నష్టం జరిగింది. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే ఫైర్‌స్టేషన్ వారికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చేలా పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాదాన్ని నివారించటంలో జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, చింతలపూడి బారిష్టార్, చావా వీరభద్రం తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. రెవెన్యూశాఖ తరుపున పంచనామ చేశారు.